రైతులకు ఇబ్బందులు రానివ్వం

- ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాల్లో ప్రజాప్రతినిధులు

కొత్తకోట రూరల్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వరిధాన్యం సేకరణ ప్రక్రియ చేపడుతున్నట్లు మదనాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్ అన్నారు. శనివారం మండలంలోని రామకృష్ణాపురం, పామాపురం గ్రామాల్లో పీఏసీఎస్ ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు పడొద్దని ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి, మద్దతు ధరకు కొంటుందని అన్నారు. అదే విధంగా సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ రాఘవేందర్‌రెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, బీచుపల్లి యాదవ్, హరిశ్చంద్రారెడ్డి, విక్రంసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

❒ పెద్దమందడి మండలంలోని వెల్టూర్‌లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వనపర్తి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని.. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ టి.రఘు ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు ఆర్.జగదీశ్వర్ రెడ్డి, విజయ్ కుమార్, గోవర్ధన్ రెడ్డి, రాంచంద్రయ్య, వెంకటయ్య, ఆవుల వెంకటన్న, బాలనర్సయ్య, నాగిరెడ్డి, జీఎల్ అనంతరెడ్డి, రాజు, కృష్ణ, ఏపీఎం నాగమణి, సీసీ.రాణి తదితరులు పాల్గొన్నారు.


రామకృష్ణాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్

అన్నదాతల సంక్షేమమే ధ్యేయం

చిన్నంబావి: అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి, కళ్యాణ్‌రావు అన్నారు. మండలంలోని పెద్దదగడ, దగడపల్లి, మియాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కుట్రలు పన్నుతున్నాయని.. సాక్షాత్తు ఉన్నతాధికారులపైకి ప్రజలను రెచ్చగొట్టి పంపించడం ఎన్నో అనుమానాలకు తావిస్తోందన్నారు. కార్యక్రమంలో డీపీఎం భాషానాయక్, ఏపీఎం మద్దిలెట్టి, సింగిల్‌విండో చైర్మన్ బగ్గారి నర్సింహారెడ్డి, బీచుపల్లి యాదవ్, చంద్రశేఖర్ యాదవ్, తేజారెడ్డి, ఇందిరా, నరసింహ్మ తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు అడ్డుకట్ట..

పాన్‌గల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో చోరీలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని ఎస్‌ఐ సందర్శించి, ధాన్యాన్ని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. అక్కడక్కడ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం చోరీలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు వస్తున్నందున ఎస్పీ ఆదేశాల మేరకు రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉంటూ ధాన్యం కాపాడుకోవాలని సూచించారు. కేంద్రాల వద్ద అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎస్‌ఐ వెంట సిబ్బంది వర్మ, అంజి ఉన్నారు.


పెద్దమందడి మండలం వెల్టూర్‌లో..


పాన్‌గల్‌లో..


చిన్నంబావి మండలం పెద్దదగడలో..

క్లుప్తంగా

మాలల ఆత్మగౌరవ పోరాటాలకు మద్దతివ్వాలి



వీపనగండ్ల: మాలల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు చేపడుతున్న పోరాటాలకు అందరూ మద్దతు తెలుపాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి కోరారు. శనివారం మండలంలోని పుల్గర్‌చర్లలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చేనెల 1న మాలల సింహగర్జన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభకు మాలలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బిజ్జ బాబురావు, ఉపాధ్యక్షుడిగా శశికపూర్, ప్రధాన కార్యదర్శిగా వడ్డెమాన్ నరేష్, సహాయ కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా బండారి రంగస్వామి, ఇన్‌చార్జిగా ఆంజనేయులు, కమిటీ కోఆర్డినేటర్‌గా విజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పాఠశాలకు ఇన్వర్టర్ అందజేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని బలిజపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం శనివారం 2006–07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఇన్వర్టర్ అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను హెచ్‌ఎం మంజులత, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకట్, వరలక్ష్మి, అలేఖ్య, నరసింహ, పర్వతాలు, రవి కిరణ్, నరేష్ పాల్గొన్నారు.

గ్రూప్‌-4లో ప్రతిభ


ఈశ్వర్‌రెడ్డి

పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన గొంది నర్సింహారెడ్డి, లక్ష్మి దంపతుల కుమారుడు ఈశ్వర్‌రెడ్డి గ్రూప్‌-4లో ఉద్యోగం సాధించి కమర్షియల్ ట్యాక్సెస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. వనపర్తి జిల్లా కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన.. గ్రూప్‌-4లో ప్రతిభ చాటారు. గ్రూప్‌-1 ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమని తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ వివరాల ప్రకారం.. నల్లగొండకు చెందిన రాకేష్ నాగర్‌కర్నూల్‌లోని ఓ ప్రైవేటు బ్యాంకు మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 29న తన ద్విచక్ర వాహనాన్ని ఓంనగర్ కాలనీలోని తన ఇంటి ఎదుట పార్కింగ్ చేసి ఊరెళ్లారు. ఈ నెల 14న జిల్లా కేంద్రానికి వచ్చిన అతడికి ద్విచక్ర వాహనం కనిపించక పోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

20న పంచలోహ శివలింగం ప్రతిష్ఠాపనోత్సవం



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి స్టేజీ వద్ద ఉన్న ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీకోటిలింగేశ్వర దత్త దేవస్థానంలో ఈ నెల 20న పంచలోహ శివలింగం ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని దేవస్థానంలో నూతనంగా నిర్మించిన ధ్యాన మందిరంలో శివలింగం ప్రతిష్ఠిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహాసంకల్ప, మహాయజ్ఞ పర్వం నిర్వహించబడుతుందని.. కోటిలింగాల ప్రతిష్ఠ అనంతరం పంచలోహ శివలింగం ప్రతిష్ఠకు ప్రత్యేక మహిమ ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

జాతీయస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు జగత్‌పల్లి విద్యార్థిని



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని జగత్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న భువనేశ్వరి జాతీయస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈనెల 15న విజయవాడలో నిర్వహించిన దక్షిణ భారతదేశ రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థిని భువనేశ్వరి 'కాస్ట్ ఎయిర్ ప్యూరిఫైయర్'ను ప్రదర్శించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 16నుంచి 21వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలోని పంచకులలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని భువనేశ్వరితో పాటు గైడ్ టీచర్ వి.జ్యోతిర్మయిని కలెక్టర్ ఆదర్శ్ సురభి, డీఈఓ గోవిందరాజులు, డీఎస్‌ఓ శ్రీనివాసులు, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. జాతీయస్థాయిలో చక్కటి ప్రతిభ కనబర్చి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తికి గాయాలు

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గ్రామ సమీపంలో బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్‌ఐ నరేష్‌కుమార్ వివరాల మేరకు.. పాన్‌గల్ మండలం కిష్టాపూర్‌కు చెందిన ముడావత్ కిషోర్ శనివారం వనపర్తి నుంచి బిజినేపల్లివైపు బైక్‌పై వెళ్తూ.. బుద్దారం సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అమరచింత బస్టాండ్‌లో వసతులు కరువు


అమరచింత బస్టాండ్


మరమ్మతుకు నోచుకోని మరుగుదొడ్లు

అమరచింత: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఆర్టీసీ ప్రయాణికులు కనీస వసతులకు నోచుకోక అవస్థలు పడుతున్నారు. బస్టాండ్‌లో మంచినీటి వసతిని ఏర్పాటు చేయక పోవడంతో ప్రయాణికులు తాగునీటి కోసం సమీపంలోని హోటళ్లకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. రెండేళ్ల క్రితం వరకు బస్సులు రాక నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను అన్నివిధాలా అభివృద్ధి పరుస్తామంటూ అధికారులు ముందుకువచ్చారు. గద్వాల డిపో బస్సులతో పాటు మరికల్, మహబూబ్‌నగర్‌వైపు వెళ్లే నారాయణపేట డిపో బస్సులను కూడా కొత్త బస్టాండ్‌కు వచ్చి వెళ్లే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో ప్రయాణికులు కొత్త బస్టాండ్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. అయితే బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలలకు మరమ్మతు చేయించక పోవడంతో నిరుపయోగంగా మారాయి. శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్లకు మరమ్మతు చేయించకుండా వదిలిపెట్టడంతో మహిళా ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు ఏ బస్సు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. బస్సుల సమాచారం అందించేందుకు కనీసం ఆర్టీసీ అధికారులు సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

మెరుగైన విద్య అందించాలి


కరపత్రాలను విడుదల చేస్తున్న డీఎస్‌పీ నాయకులు

వనపర్తిటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అమెరికా స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ డిమాండ్లకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 3.50 కోట్ల మంది బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఉన్నారని.. వారందరికీ కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలని అన్నారు. భూమిలేని ప్రతి నిరుపేదకు ఎకరా భూమి ఇచ్చి అండగా నిలవాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అశోక్, కుర్మన్న, బలరాం, లక్ష్మణ్, ఆంజనేయులు ఉన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించండి

అమరచింత/పాన్‌గల్: సమగ్ర కుటుంబ సర్వే కోసం వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు కోరారు. అమరచింత మండలంలోని కొంకన్వానిపల్లె, నాగల్‌కడ్మూర్ గ్రామాలతో పాటు మున్సిపాలిటీలోని వివిధ బ్లాక్‌లలో ఇంటింటి సర్వేను పరిశీలించారు. సర్వేలో తప్పులకు తావివ్వకుండా జాగ్రత్తగా నిర్వహించాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. ఈ సందర్భంగా సర్వే వివరాలను తెలుసుకున్నారు. ఎంపీడీఓ వెంట డిప్యూటీ తహసీల్దార్ రెడ్యా నాయక్, ఆర్‌ఐ గోపాల్, ఎంపీఓ నర్సింహులు ఉన్నారు.

❒ పాన్‌గల్ మండలంలో సమగ్ర కుటుంబ సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. మొత్తం 28 గ్రామ పంచాయతీల్లో 1,056 కుటుంబాల నుంచి వివరాలను సేకరించినట్లు అధికారులు పేర్కొన్నారు. సర్వే వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు.


నాగల్‌కడ్మూర్‌లో సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు


పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లితండాలో..

డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత

పాన్‌గల్: డ్రగ్స్‌ను నిర్మూలించి, సమాజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎస్‌ఐ శ్రీనివాసులుతో కలిసి 'డ్రగ్స్ నిర్మూలిద్దాం – సమాజాన్ని కాపాడుదాం' కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత, విద్యార్థులకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మహనీయులను స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలని సూచించారు. పిల్లలు చెడు వ్యసనాలకు బానిస గురికాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ మండల కన్వీనర్ కమలాకర్, భీమయ్య, రాము, హెచ్‌సీ రోశయ్య పాల్గొన్నారు.

ముగిసిన నాటక ప్రదర్శనలు



చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి జాతరలో నిర్వహిస్తున్న నాటక ప్రదర్శనలు శనివారం ముగిశాయి. భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ ప్రభుత్వం, కలీమ్ కల్చరల్ థియేటర్ వారి ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నాటక ప్రదర్శనలు కొనసాగాయి. మొదటిరోజు శుక్రవారం ధనం మూలం ఇదం జగత్ జానపద సంగీత నాటకం, రెండోరోజు శనివారం రామాంజనేయ యుద్ధం నుంచి యుద్ధఘట్టం నాటికను ప్రదర్శించారు. నాటక ప్రదర్శనలో పలువురు కళాకారులు తమ కళా నైపుణ్యంతో అందరినీ అలరించారు. అనంతరం కళాకారులను ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డిలతో పాటు పలువురు అభినందించి శాలువాలతో సన్మానించారు.

పట్టుబడిన దొంగ

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని బసవన్నగడ్డ కాలనీ మసీదులో చోరీకి పాల్పడిన దొంగను శనివారం పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. బసవన్నగడ్డ కాలనీ మసీదులో శుక్రవారం చోరీ జరిగింది. మసీదు పెద్దల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. అక్కడ ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. గద్వాలకు చెందిన అజ్మతుల్లా చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. అతడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధి హామీ.. పర్యవేక్షణ లేమి


అన్నారంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- కొత్త జీపీల్లో ఫీల్డ్ అసిసెంట్లు లేక ఇబ్బందులు
- పంచాయతీ కార్యదర్శులు, మేటీలతో నెట్టుకొస్తున్న వైనం

పాన్‌గల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత వేధిస్తోంది. కొన్ని గ్రామాల్లో పనుల నిర్వహణ, కూలీల హాజరు నమోదు, పనుల గుర్తింపునకు ఫీల్డ్ అసిస్టెంట్లు కరువయ్యారు. దీంతో పంచాయతీ కార్యదర్శులు, మేటీల ద్వారా ఉపాధి హామీ పథకం పనులను నెట్టుకొస్తున్నారు. పాన్‌గల్ మండలంలో 28 గ్రామపంచాయతీలు ఉండగా.. ప్రస్తుతం 15 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రమే పనిచేస్తున్నారు. పాన్‌గల్, మల్లాయిపల్లి, చిక్కేపల్లి, శాగాపూర్ గ్రామాలతో పాటు మరో 10 కొత్త జీపీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో ఉపాధి కూలీలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో 15,486 జాబ్‌కార్డులు ఉండగా.. 6,049 కుటుంబాల్లో 9,427 మంది కూలీలు ఉన్నారు.

కొరవడుతున్న పర్యవేక్షణ..

మండలంలో నాలుగు పాత జీపీలు, పది కొత్త జీపీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో పనుల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతి ఏటా సుమారు రూ.10 కోట్లకు పైగా విలువచేసే పనులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు, నాలుగు చోట్ల ఒకే సమయంలో జరిగే పనులు, కూలీల హాజరుపై పర్యవేక్షణ కొరవడుతోంది. ప్రస్తుతం మండలంలో 2025–26 సంవత్సరానికి పనుల గుర్తింపు కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నారు. రైతులకు ఉపయోగపడే పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఉపాధి పనుల పర్యవేక్షణ పక్కాగా ఉండాలంటే సిబ్బంది కొరత లేకుండా ఉండాలని పలువురు పేర్కొంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.



కొత్త గ్రామపంచాయతీలతో పాటు కొన్ని పాత జీపీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్న విషయం వాస్తవమే. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సమస్యను మారోమారు వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– కుర్మయ్య, ఏపీఓ, పాన్‌గల్

పనులకు ఆటంకం..



కొత్త జీపీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేక పంచాయతీ కార్యదర్శి, మేటీల ద్వారా పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సరైన పర్యవేక్షణ లేక పనుల నిర్వహణకు ఆటంకం కలుగుతుంది. కూలీలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లకు పనిభారం పెరిగి ఒత్తిడికి గురవుతున్నారు. అధికారులు స్పందించి కొత్త జీపీలకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలి.

– బాల్యానాయక్, సీపీఎం మండల కార్యదర్శి, తెల్లరాళ్లపల్లితండా

ఇబ్బందులు పడుతున్నాం..



ఉపాధి హామీ పనుల పర్యవేక్షణకు ఫీల్డ్ అసిస్టెంట్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మొత్తం 28 జీపీలకుగాను కేవలం 14 మంది మాత్రమే విధులు నిర్వహిస్తుండటంతో పనిభారం పెరిగి ఒత్తిడికి లోనవుతున్నాం. పాత జీపీల్లో ఖాళీగా ఉన్న పోస్టులతో పాటు నూతన జీపీల్లో కూడా ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించి ఇబ్బందులను తొలగించాలి.

– బీరయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు, కేతేపల్లి